వావ్.. హలీమ్..!

మంచిర్యాలఅర్బన్: ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం రంజాన్ మొదలైంది. భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉంటూ నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు. రంజాన్ అంటే ఎక్కువ మందికి గుర్తుకొచ్చేది హలీమ్. ముస్లింలు కాకుండా అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. నగరాలకు తీసిపోని విధంగా మంచిర్యాలలో హలీమ్ సెంటర్లు వెలిశాయి. హలీమ్ రుచిగా ఉండటమే కాదు.. ఆరోగ్యాన్ని ఇస్తుంది. రంజాన్ నేపథ్యంలో ప్రత్యేకంగా తయారు చేసే హలీమ్ ప్రత్యేకతపై 'సాక్షి' కథనం..



విద్యుత్ వెలుగుల్లో హలీమ్ కేంద్రాలు



హలీమ్ తయారీ

- రంజాన్ మాసం పురస్కరించుకుని అధికంగా అమ్మకాలు
- మంచిర్యాలలో ప్రత్యేకంగా వెలసిన తయారీ కేంద్రాలు



హలీం, హరీస్ అంటే..
హలీమ్ (మటన్), హరీస్ (చికెన్) తయారు చేస్తారు. చూసేందుకు పేస్ట్‌లా మెత్తగా ఉంటుంది. ఇందులో ఉపయోగించే పదార్థాలన్నింటిలోనూ పోషకాలు సంవృద్ధిగా ఉంటాయి. సుమారు 10గంటల నుంచి 12గంటల సమయం పడుతుంది. మాంసం, గోధుమలు, నెయ్యి, జాజికాయ, సాజిర, పాలు, గులాబిరేకులు, యాలకులు, మొగ్గ, మిరియాలు పూత, గసాలా, మినపప్పు, శనగపప్పు, కందిపప్పు, అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయాలు 48రకాల ఆహార పదార్థాలు వినియోగిస్తూ తయారు చేస్తుంటారు.

హలీమ్.. ఆరోగ్యకరం
హలీమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తక్షణమే శరీరానికి శక్తినిస్తుంది. పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల నెమ్మదిగా జీర్ణం అవుతుంది. డ్రైఫ్రూట్స్ చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. 250ఎంఎల్ హరీస్ రూ.60, హలీమ్ రూ. 140 వరకు లభిస్తుంది.

కేంద్రాల వద్ద సందడి..
పొద్దంతా తయారు చేసిన హలీమ్ కోసం కేంద్రాల వద్ద సందడి నెలకొంది. మంచిర్యాలలో ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా, రైల్వేస్టేషన్ రోడ్‌లో హలీమ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు విరమణ తర్వాత కేంద్రాల వద్దకు చేరుకుంటుండటంతో సందడిగా నెలకొంది.


హలీమ్, డబుల్‌కా మీటా


హలీమ్ కేంద్రాల్లో సందడి

ఎంతో టేస్టీగా..



రంజాన్ మాసంలో రోజా(ఉపవాసం) ఉంటాం. ఉపవాసదీక్షల విరమణ తర్వాత మార్కెట్‌లో లభించే రంజాన్ ప్రత్యేక వంటకాలు భుజిస్తాం. రంజాన్ మాసంలో ప్రత్యేక వంటకాలు తినడంతో పాటు ఇంటిల్లిపాదికి సైతం తీసుకెళ్లడం జరుగుతుంది. ప్రత్యేక వంటకాలు హలీం నచ్చనివారు ఉండరు. – అబ్దుల్ సత్తార్

పోషకాలెన్నో..?



రంజాన్ నెలలో ఉపవాసం కారణంగా కొంతమేర నీరసం వస్తుంది. పోషకాలున్న హలీమ్ ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది. బలవర్ధకమైన పోషకాలు హలీమ్, హరీస్‌లో ఉంటాయి. హలీంతో అనేక ఆరోగ్యమైన ప్రయోజనాలున్నాయి. – సాధిక్‌ఖాన్, హలీమ్ ప్రియుడు

భలే డిమాండ్..



ఈ ఏడాది హలీమ్‌కు భలే డిమాండ్ ఉంది. వినియోగదారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేయటానికి వస్తున్నారు. హలీం కాకుండా డబుల్ కా మీటాపై కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కస్టమర్ల అభిరుచుల మేరకు వెరైటీలను తయారు చేస్తున్నాం. – మహ్మద్ మున్వర్, హలీం కేంద్ర నిర్వహకుడు

క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే


విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన రెండో జోన్‌లో గల పెద్ద మజీద్‌లో ఇఫ్తార్ విందులో శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ ముస్లిం పెద్దలతో కలిసి విందు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలు ఉన్నారు.

జీవాలకు ముందస్తు టీకాలు తప్పనిసరి


టీకా వేస్తున్న సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: పశువులకు ముందస్తు టీకాలు వేయించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చని మండల పశువైద్యాధికారిణి పావని అన్నారు. మండలంలోని చంద్రవెల్లిలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వేసవిలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేష్, శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మంచిర్యాలటౌన్: జర్నలిస్టుల సంక్షేమాన్ని, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో జర్నలిస్టు డిమాండ్స్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యం, సంపత్ పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై దృష్టి పెట్టండి


నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీవో

జన్నారం: వేసవిలో ఎండలు తీవ్రమవుతున్నందునా నర్సరీలలో మొక్కల పెంపకం, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఎంపీవో రమేశ్ అన్నారు. మండలంలోని కలమడుగు, ధర్మారం, లింగయ్యపల్లి గ్రామాల్లో నర్సరీలను, డంపింగ్ యార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు.

పిల్లలకు మంచి విద్య అందించాలి



నెన్నెల: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు, అంతస్తులకన్నా ముఖ్యంగా మంచి విద్యను అందించాలని మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని లోటస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుంచే బాగా చదువుకునేలా ఉన్నత స్థానానికి ఎదిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచిగా చదివిస్తే ఆ కుటుంబం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓను ఆ పాఠశాల కరస్పాండెంట్ మద్దెర్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వెంకటేష్, పాఠశాల టీచర్లు శాలువాలతో సన్మానించారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి.

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందోత్సహాలతో కేరింతలు కొడుతూ హోలీ జరుపుకున్నారు. తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాలగురిజాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆయా పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. విద్యార్థులు, చిన్నారులు నృత్యం చేస్తూ ఎంతో సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'


కరపత్రాలతో ప్రచారం చేస్తూ...

దండేపల్లి: అభివృద్ధి అనేది బీజేపీతోనే సాధ్యమని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్‌లో శనివారం లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి, మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటేసీ పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోటపల్లి: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాలను పరిశీలించారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో ఆకుల భూమన్న, ఆర్‌ఐ రాజలింగు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు


జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నస్పూర్: నిషేధిత ప్లాస్టిక్ వాడితే జరిమానా విధించడంతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న పలు మద్యం దుకాణదారులకు మున్సిపల్ సిబ్బంది రూ.7వేల జరిమానా విధించారు. పలు ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించడమైందని తెలిపారు. వివిధ వ్యాపార యజమానులు, ప్రజలు 75మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని ఎవరూ వాడకూడదని సూచించారు. నింబంధనలు ఎవరైనా అతిక్రమించి నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు
చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రభుత్వం 120మైక్రాన్ కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను వాడకాన్ని నిషేధించిందన్నారు. చిరు వ్యాపారులు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే ఆ వ్యాపారులకు రూ.5వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వ్యాపారులు ఈ విషయాన్ని గమనించి మున్సిపల్ అధికారులను సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశుంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సాధికారిక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్సిల్ లిటరసీ లిఫ్సిక హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్వప్న, సిబ్బంది ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి కొమ్మెర-1 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత హాజరై చిరుధాన్యాల ప్రాముఖ్యతను గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

లంబాడీతండాలో అక్షరాభ్యాసం
కాసిపేట: మండలంలోని లంబాడితండా(డి) రాంనాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, ఏఎన్‌ఎం శోభారాణి, అంగన్‌వాడీ టీచర్ అమృత ఆశ వర్కర్, ఆయ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు అధికం
తాండూర్: చిరు ధాన్యాలలో పోషకాలు మెండుగా ఉంటాయని ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత అన్నారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, కూరగాయల్లో లభించే పోషకాలను వివరించారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు


కోటపల్లి: నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం


చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: భగత్‌సింగ్ వర్ధంతిని రామకృష్ణాపూర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువకులను చైతన్యవంతం చేసి బ్రిటీషర్ల గుండెల్లో వణుకుపుట్టించిన వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, పౌల్, వెంకటస్వామి, వనం సత్యం, సాంబయ్య, మొండి, రవి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ చిత్రపటానికి హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో నివాళులర్పించారు. భగత్‌సింగ్ స్వాతంత్య్రోద్యమంలో ఆచరించిన విధానాలను హెచ్‌ఎం బుచ్చన్న విద్యార్థులకు వివరించారు. వీవో అధ్యక్షురాలు భాగ్య, సీఏ రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం షహీద్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు దబ్బెట రాజమల్లు స్వాతంత్య్ర సమరంలో అమరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కవులు మామిడి అక్షిత, కొల్లూరి రవీందర్, సునీల్‌లు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం
మంచిర్యాలఅర్బన్: భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంచిర్యాల న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ అధ్యక్షతన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా సదస్సు జరిగింది. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, పీవోడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి మంగ, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మల్లన్న, నాయకులు సంధ్య, శ్రావణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ కార్యదర్శిని కలిసిన మున్సిపల్ మాజీ చైర్మన్


రోహిత్ చౌదరితో మాట్లాడుతున్న సూరిబాబు

బెల్లంపల్లి: ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.సూరిబాబు శనివారం కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వెళ్లి ప్రత్యేకంగా సమావేశమై పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బెల్లంపల్లి మున్సిపల్, ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్ తదితర పదవులన్నీ ఎస్సీలకు రిజర్వు చేశారని, బీసీలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని వివరించారు. ప్రకటిత 37 కార్పొరేషన్ చైర్మన్లలో ప్రభుత్వం బెల్లంపల్లి బీసీలకు ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. సానుకూలంగా స్పందించిన రోహిత్‌చౌదరి బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ప్రకటించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను శనివారం డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు పలు సూచనలు చేశారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని అలాగే త్వరలో జరిగే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బొక్కలగుట్టలోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, నోడల్ అధికారి సదానందం, ఏపీఓ రజియా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల కింద పంట వ్యర్థాలు తగులబెట్టొద్దు

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ లైన్ల కింద పంట చేన్లలో మిగులు వ్యర్థాలను తగులబెట్టొద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జీఎం డి.సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులను తగులబెట్టడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడడంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని రామగుండం-చంద్రపూర్ లైన్, రాయగడ్-పూగలూరు లైన్ల పరిధిలోని జైపూర్, కాసిపేట, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్ మండలాల పరిధిలోని రైతులు ఎండు గడ్డి, పత్తి కట్టె, చెత్త, ఇతర వ్యర్థాలను తగులబెట్టడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతోపాటు సమీపంలోని జీవరాశికి ప్రమాదం జరిగే వకాశం ఉందని తెలిపారు.

గడ్డం వంశీకృష్ణకు ఘనస్వాగతం


స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

జైపూర్/చెన్నూర్: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిలకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎంపీ అభ్యర్థిగా వంశీకృష్ణను ప్రకటించిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి రాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

నూతన కార్యవర్గం ఎన్నిక
బెల్లంపల్లిరూరల్: పురగిరి క్షత్రియ(పెరక) సంఘం బెల్లంపల్లి మండల నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. మండల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పురగిరి క్షత్రియ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకిరెడ్డి శంకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా తొంగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సందెల మల్లేష్, కోశాధికారిగా బియ్యాల గణేష్, ఉపాధ్యక్షుడిగా మీస రమేష్, కందుల ముకుందంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రతీరోజు క్లోరినేషన్ చేయాలి
భీమారం: ప్రతీరోజు గ్రామపంచాయతీల్లో గల మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. వేసవికాలం-క్లోరినేషన్ అంశంపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ఈ మేరకు ప్రభుత్వం అందిస్తున్న క్లోరినేషన్ కిట్లతో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసిన అనంతరమే స్వచ్ఛ నీటిని ప్రజలకు నల్లాల ద్వారా అందించాలని ఆమె కోరారు. ఇందులో ఎంపీవో సతీష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం
బెల్లంపల్లి: మున్సిపల్ కాంటా చౌరస్తాలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

వైష్ణవి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి
బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి భీముని వైష్ణవి ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన బాధ్యులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ బెల్లంపల్లి శాఖ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. పాలిటెక్నిక్ కళాశాలలో సహచర విద్యార్థి పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేయించడంతో వైష్ణవిని ఇరువురు అధ్యాపకులు మాలతి, నాగరాజు వేధింపులకు గురిచేశారని తెలిపారు. ఆ అవమానాన్ని తట్టుకోలేక ఇంటికి వెళ్లి వైష్ణవి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. అందుకు కారణమైన అధ్యాపకులపై విచారణ జరిపి ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.